క్లుప్తంగా

దీక్షను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఎండీ జహంగీర్

భువనగిరిటౌన్ : రీజనల్ రింగ్ రోడ్డు బాధితులతో ఈ నెల 18న చేపట్టనున్న సామూహిక నిరసన దీక్షను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ జహంగీర్ అన్నారు. ఆదివారం సుందరయ్య భవనంలో ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. 24, 25 తేదీల్లో చౌటుప్పల్, భువనగిరి ఆర్డీఓ కార్యాలయం ఎదుట దీక్షలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నరసింహ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, గడ్డం వెంకటేష్, నాయకులు ఈర్లపల్లి ముత్యాలు, లావుడియ రాజు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తాం



బియ్యం పంపిణీ చేస్తున్న శివాజీ యూత్ ప్రతినిధులు

చౌటుప్పల్ : శివాజీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని యూత్ అధ్యక్షుడు గుజ్జుల సురేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో యూత్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మందికి 25కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ ప్రతినిధులు ఊడుగు వెంకటేశం, అన్నెమోని గోవిందరాజు, బత్తుల శ్రీశైలం, ఊడుగు మల్లేష్, రాజపేట అశోక్, అమృతం వెంకటేశం, అచ్చిని గణేష్, కాసుల వెంకటేష్, పరమేష్, శేఖర్, భాస్కర్‌చారి, రాజేందర్ రెడ్డి, సారధి తదితరులు పాల్గొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మోత్కూరు : మోత్కూరు నాగార్జున రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించనున్నట్లు సహకార సంఘం చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు(ఎం): మండలంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త జెట్ట శ్రీనువాస్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఇసుక డంప్ స్వాధీనం

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో ఓ వ్యవసాయ బావి వద్ద ఏర్పాటు చేసిన ఇసుక డంప్‌ను ఆదివారం ఎస్ఓటీ పోలీసులు స్వాధీనం చేసుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు ఎస్ఓటీ పోలీసుల సూచన మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ హనుమంతు తెలిపారు.

సమగ్ర విచారణ చేపట్టాలి



యాదగిరిగుట్ట : మాట్లాడుతున్న కర్రె ప్రవీణ్

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం తరపున విదేశాల్లో కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్న అధికారులపై సమగ్ర విచారణ చేపట్టాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విదేశాల్లో స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని జరిపిస్తున్నామని చెబుతున్న ఆలయ అధికారులు, భారతదేశంలోని అన్ని రాష్ట్రాల్లో, ప్రధాన నగరాల్లో స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. దేశంలో ఆయా రాష్ట్రాల్లో శ్రీస్వామి కల్యాణాన్ని నిర్వహించి, హిందూ ధర్మాన్ని ప్రచారం చేయాలన్నారు. నాలుగు రోజుల కల్యాణోత్సవం పేరుతో నలభై రోజులు విదేశాలకు వెళ్లడంపై విచారణ జరపించాలన్నారు. ఈ సమావేశంలో పట్టణ ప్రధాన కార్యదర్శి జిల్లా భానుచందర్, కార్యదర్శి పలుగుల సురేష్, ఆవుల సత్యనారాయణ, బెలిదే అశోక్, బందారపు మల్లేష్‌గౌడ్, సుడుగు రాజిరెడ్డి, దొమ్మాట నరేష్, బోడ బుచ్చిబాబు, కర్రె లక్ష్మయ్య, శివరాత్రి శ్రీశైలం, రాపోలు నవీన్, అజయ్, కాలూరి విజయ్, శివరాత్రి వంశీ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుపర్చాలి

ఆలేరు : పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుద్ధ్యం లోపించడంతో ప్రజారోగ్యంపై ప్రభావం పడుతుందన్నారు. ఆయనవెంట గొట్టిపాముల రాజు, అంజనేయులు, అభి, గిరిరాజు,అంజయ్య పాల్గొన్నారు.

వంతెన నిర్మించారు.. వదిలేశారు

- ఆసిఫ్‌నహర్ కాలువపై 2017లో రూ.1.90 కోట్లతో నిర్మించిన వంతెన
- అప్రోచ్ రోడ్డు వేయక నేటికీ వినియోగంలోకి రాని బ్రిడ్జి
- శిథిలదశలో ఉన్న పాతవంతెన పైనుంచే రాకపోకలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



ఆసిఫ్‌నహర్ కాలువపై నిర్మించిన వంతెన

రామన్నపేట : రామన్నపేట మండలం కక్కిరేణి గ్రామ శివారులో ఆసిఫ్‌నహర్ కాలువపై రూ.1.90 కోట్లతో వంతెన నిర్మించారు. బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయి ఎనిమిదేళ్లు గడిచిన నేటికీ అందుబాటులోకి రాలేదు. అయితే వంతెనకకు అనుసంధానంగా అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయకపోవడంతో ఏళ్లు గడుస్తున్న ఈ బ్రిడ్జి నిరూపయోగంగానే ఉంది.

శిథిల దశలో పాత బ్రిడ్జి

రామన్నపేట మండలలంలోని కక్కిరేణి-ఎన్నారం గ్రామాల మధ్య ఆసిఫ్‌నహర్ కాలువపై సుమారు 120 సంవత్సరాల క్రితం వంతెన నిర్మించారు. ఈ వంతెన శిథిల దశకు చేరడంతో పాటు ఇరుకుగా ఉండడంతో హార్వెస్టర్ లాంటి భారీ వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అయితే 2016లో అసిఫ్‌నహర్ కాలువపై నూతన వంతెన నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రోడ్లు భవనాల శాఖ నుంచి రూ. రు 1.90కోట్లు మంజూరు చేసింది. 12మీటర్ల వెడల్పు, 43మీటర్ల పొడవుతో వంతెన నిర్మించేందుకు అధికారులు ఎస్టిమేట్‌వేసి సాంకేతిక అనుమతి పొందారు. 2017 జనవరి 2న అప్పటి, ప్రస్తుత ఎమ్మెల్యే వేముల వీరేశం వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వంతెన నిర్మాణ పనుల టెండర్ దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ ఆరు నెలల్లోనే వంతెన నిర్మాణం పూర్తి చేశారు.

అప్రోచ్ రోడ్డు వేయకపోవడంతో..

నూతనంగా నిర్మించిన వంతెన నుంచి రాకపోకలు సాగించడానికి ఇరువైపులా అప్రోచ్‌రోడ్డు నిర్మించాల్సి ఉంది. అయితే వంతెనకు ఇరువైపులా సమాధులు ఉన్నాయి. సమాధులను తొలగిస్తేనే అప్రోచ్‌రోడ్డు వేయడానికి వీలవుతుంది. పూర్వికుల సమాధులకు సంబంధించిన కుటుంబాల వారిని ఒప్పించి మరో చోటుకు తరలించడం, పునర్నిర్మాణానికి అవసరమైన వ్యయాన్ని చెల్లించే విషయంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారు. సమాధులను తరలించడం, సున్నితమైన అంశం కావడంతో అధికారులకు, ప్రజాప్రతినిధులకు కత్తిమీద సా మైంది. దీంతో అప్రోచ్ రోడ్డు వేయకపోవడంతో వంతెన నిర్మించి ఎనిమిదేళ్లయినా నిరుపయోగంగానే ఉంటుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి గల ఆటంకాలను పరిష్కరించి వంతెనను ఉపయోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



శిథిల దశలో ఉన్న పాత వంతెన

ప్రతిపాదనలు పంపించాం

నూతనంగా నిర్మించిన వంతెన నుంచి రాకపోకలు సాగించడానికి ఇరువైపులా అప్రోచ్‌రోడ్డు నిర్మించాల్సి ఉంది. వంతెనకు ఇరువైపుల సమాధులున్నాయి. వాటి రిలోకేషన్ అవసరమైన నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పేమేంట్ జరిపి అప్రోచ్‌రోడ్డు పనులు చేపడతాం.

– నవీన్, ఆర్ అండ్ బీ ఏఈ, రామన్నపేట

భూ నిర్వాసితులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న వేముల అశోక్

భువనగిరి : బీఎస్ తిమ్మాపురం భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసేందుకు వెళ్తున్న బీజేపీ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం దారుణమన్నారు. బీజేపీ రైతుల పక్షాన ఉండి పోరాడుతున్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని భూ నిర్వాసితులకు బీజేపీ న్యాయం చేస్తుందన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అశోక్‌గౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా, అచ్చయ్య, శేఖర్‌రెడ్డి, యాదిరెడ్డి, నరేష్, కృష్ణ, వైజయంతి, లక్ష్మీనారాయణ, బలరాం, సురేష్‌రెడ్డి, నరసింహారావు, కపిల్ పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



బాకీకార్డులు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

అడ్డగూడూరు : హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయకుండా ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందన్నారు. స్థానిక ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు వచ్చే కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీయాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్ర నాథ్, మాజీ ఎంపీపీ దర్శనాల అంజయ్య, బీఆర్‌ఎస్ నాయకులు సత్యం గౌడ్, దాసరి బాలరాజు, అథోని, చలపతి రెడ్డి, రవి, అయోధ్య, రమేష్, అరవింద్, పరమేష్, అబ్బులు, కిరణ్,నరేష్, భరత్, నవీన్, బాబు తదితరులు పాల్గొన్నారు.

కల్లు గీత కార్మికులు ఐక్యంగా పోరాడాలి



మాట్లాడుతున్న వెంకటరమణ

యాదగిరిగుట్ట: తమ హక్కుల సాధనకు గీత కార్మికులు ఐక్యంగా పోరాడాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ పిలుపునిచ్చారు. యాదగిరిగుట్ట పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. ప్రమాద నివారణకు ఇస్తున్న కాటమయ్య రక్షణ కవచం పథకం నత్తనడకన నడుస్తుందనన్నారు. వృత్తి చేసే వారందరికీరక్షణ కవచం ఇవ్వాలన్నారు. పెండింగ్ ఎక్స్‌గ్రేషియా డబ్బులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వృత్తిలో ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ చేపట్టాలన్నారు. ఈ నెల 28న చౌటుప్పల్‌లో జరిగే జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యాక్షులు బొలగాని సత్యనారాయణ, వి.వెంకటనర్సయ్య, రాష్ట్ర కమిటి సభ్యురాలు ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, మండల గౌరవ అధ్యక్షులు ఎరుకల హేమేందర్, మండల అధ్యక్షులు కోల వెంకటేష్, సొసైటి అధ్యక్షులు గంధమల్ల ఉపేందర్, సీస కృష్ణ, తుర్కపల్లి మండల అధ్యక్షులు శ్రీరాంమూర్తి, నాయకులు మచ్చ నర్సింహులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): గీత కార్మికులు తమ హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోలగాని జయరాములు అన్నారు. ఈ నెల 28న చౌటుప్పల్‌లో నిర్వహించనున్న కల్లు గీత కార్మిక సంఘం జిల్లా నాల్గవ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం మండలంలోని రాయిపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పరకాల అంజయ్య సంఘం సభ్యత్వానికి, పదవికి రాజీనామా చేసి కల్లు గీత కార్మిక సంఘంలో చేరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి చెరుకు మల్లేశం గౌడ్, మండల గౌరవ అధ్యక్షుడు పంజాల నర్సయ్య, మండల అధ్యక్షుడు గడ్డం దశరథ గౌడ్, ప్రధాన కార్యదర్శి గుండెగాని అయిలయ్య పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లను అడ్డుకునేందుకు కుట్ర

ఆలేరురూరల్ : బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అడ్డుకునేందుకు బీజేపీ, బీఆర్‌ఎస్ కుట్ర చేస్తున్నాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొంద్రాజు వెంకటేశ్వరరాజు అన్నారు. ఆదివారం ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల మనోభావాలతో రాజకీయం చేసేందుకు బీఆర్‌ఎస్, బీజేపీలు డ్రామాలు చేస్తున్నాయని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలే చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బీసీలకు న్యాయం చేయడమే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం లక్ష్యమన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ గందమల్ల అశోక్, జితేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, జాహంగీర్, కర్రె అజయ్, విక్రమ్, భాస్కర్, శ్రీనివాస్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహా సభలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కల్లూరి మల్లేశం

రామన్నపేట : నవంబర్ 7, 8 తేదీల్లో నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేఖ విధానాలపై చర్చించనున్నట్లు తెలిపారు. గొరిగే సోములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బొడ్డుపల్లి వెంకటేశం, బందెల భిక్షం, నకిరేకంటి రాము,వంగాల మారయ్య, బెక్కం జయమ్మ,వడ్లకొండ రమేష్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాలు



మాట్లాడుతున్న విశ్వ జంపాల

ఆలేరురూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని విశ్వ సమాజ వ్యవస్థాపకుడు విశ్వ జంపాల అన్నారు. ఆదివారం మండలంలోని కొల్లూరు గ్రామంలో నిర్వహించిన తెలంగాణ ప్రజాస్వామ్య కార్మిక సంఘం ఆవిర్భావ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. హిందుత్వ ముసుగులో బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య మతపరమైన ఘర్షణలు సృష్టిస్తూ అధికారాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో సుద్దాల నాగరాజు, జి. నరేందర్, ఎం.యాక్కయ్య, జి.చందు, రచ్చ రామ్‌నర్సయ్య, కంతి మహేందర్, ప్రభాకర్, శ్వేత, శ్రీలత, సిద్దయ్య, వెంకన్న, పరుశరాములు, అనిత, సోమయ్య, సంపత్, మనోహర్, స్వామి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఊదరి యాదగిరి ఆశయసాధనకు కృషిచేయాలి



యాదగిరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

భువనగిరిటౌన్ : సీపీఎం నాయకుడు ఊదరి యాదగిరి ఆశయసాధనకు కృషి చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని దుంపల మల్లారెడ్డి స్మారక భవనంలో యాదగిరి 23వ వర్ధంతిని సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రైతులు, పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గద్దె నరసింహ, కల్లూరి మల్లేశం, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, గంధమల్ల మాతయ్య, బందెల ఎల్లయ్య, వనం రాజు, కల్లూరి నాగమణి, పట్టణ కమిటీ సభ్యులు వల్దాస్ అంజయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో అనా రోగ్యంతో మృతి చెందిన పైళ్ల పెంటయ్య కుటుంబానికి ఆదివారం కేహెచ్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొప్పుల హరిదీప్‌రెడ్డి రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ యాస కవిత, గ్రామ శాఖ అధ్యక్షుడు కోరె వెంకన్న, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గడ్డం దశరథ గౌడ్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

తుర్కపల్లి : మండల కేంద్రంలో ఆదివారం కుమ్మర సంఘం గ్రామ కమిటీ ఎన్నికను ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవరుప్పుల మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ అధ్యక్షుడిగా జీవిలికపల్లి రాములు, ఉపాధ్యక్షుడిగా గంగాధరి నర్సింహులు, కార్యదర్శి భాస్కర్, కోశాధికారిగా మహేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కుమ్మరి కులస్తుల అభివృద్ధికి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు కన్వినర్ జీవిలికపల్లి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి నాగాయిపల్లి శివరాములు, సత్యనారాయణ, కొలనుపాక కొండల్, మహేష్, శ్రీనివాస్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు

ఆలేరురూరల్ : స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బీజేపీ జిల్లా నాయకుడు బైరీ మహేందర్ గౌడ్ అన్నారు. ఆలేరు మండలంలోని సాయిగూడెంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలను రేవంత్ రెడ్డి మోసం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కామిటికారి కృష్ణ, బైరి నర్సయ్య, కుండె గణేష్, చింతకింది శ్రీధర్, సత్తయ్య, బి.వెంకటేష్, ఎం.రత్నాకర్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో వసతి గృహం

తుర్కపల్లి : మండలంలోని మాదాపూర్ ఎస్టీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరింది. భవనం స్లాబ్ పెచ్చులూడి ఇనుప చువ్వలు తేలాయి. చిన్నపాటి వర్షం కురిసిన గదులు కురుస్తుండంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. భవనం ఎప్పుడు కూలి పడుతుందోనని వసతి గృహంలో ఉండే విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. శిథిల భవనానికి కనీస మరమ్మతులు కూడా చేపట్టడం పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వసతి గృహానికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మాదాపూర్‌లోని వసతి గృహంలో ఇనుప చువ్వలు తేలిన స్లాబ్



అపరిశుభ్రంగా ఆలయ పరిసరాలు



రేణుకా ఎల్లమ్మ ఆలయ సమీపంలో పేరుకుపోయిన చెత్తాచెదారం

భువనగిరిటౌన్ : భువనగిరి పట్టణ శివారులో గల శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి దేవాలయం ఆవరణ పరిసరాలు అపరిశుభ్రతకు నిలయంగా మారాయి. ఆలయ సమీపంలోనే స్థానికులు చెత్త వేస్తుడడం.. ఆలయానికి వెళ్లే మార్గంలో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆలయం చుట్టూ చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని పలువురు భక్తులు వాపోతున్నారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో అటు ఆలయ అధికారులు, ఇటు మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్య తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఆలయానికి వెళ్లే మార్గంలో ప్రవహిస్తున్న మురుగు నీరు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రామన్నపేట : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రామన్నపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 1989–90 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నకిరేకంటి మొగులయ్య, రామిని రమేష్, పాల్వంచ హరికిషన్, ఆకారపు నర్సింహ, గోదాసు రమేష్, ఆనంద్, పొట్లపల్లి శ్రీధర్, బావండ్లపల్లి సత్యం, తిరుగుడు కృష్ణ, ముజీబ్, పాతూరి కృష్ణారావు, భారీ, శ్రీను, జగన్, మోయిస్, భాస్కర్ పాల్గొన్నారు.

బడి దూరం.. చదువు భారం

- పిట్టలగూడెంలో ప్రభుత్వ పాఠశాల లేక ఇబ్బందులు
- 3 కి.మీ దూరంలోని మల్లాపురం పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి
- రవాణా సౌకర్యం కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రుల వేడుకోలు



ప్రైవేటు వాహనం ఎక్కి వెళ్తున్న విద్యార్థులు

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని మల్లాపురం మధిర గ్రామమైన పిట్టల గూడెంలో ప్రభుత్వ పాఠశాల లేదు. దీంతో ఆ గ్రామానికి చెందిన పిల్లలు చదువుకోవడానికి మూడు కిలోమీటర్ల దూరంలో గల మల్లాపురం గ్రామంలోని పాఠశాలకు వెళ్లాల్సి వస్తోంది. గ్రామంలోని 25 మంది విద్యార్థులు మల్లాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నెల రూ.400 చెల్లించి ప్రైవేటు వాహనంలో పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

చదువు ఆపేస్తున్న విద్యార్థులు

మల్లాపురం మధిర గ్రామమైన పిట్టల గూడెం గ్రామంలో 30 ఇళ్లు, 85 మంది ఓటర్లు ఉన్నారు. గ్రామంలో మొత్తం 130 మంది జనాభా ఉంది. గ్రామస్తులు పొట్ట కూటి కోసం నిత్యం రోజువారి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. నిరుపేద కుటుంబాలు కావడంతో తమ పిల్లలందరిని మల్లాపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తున్నారు. గతంలో గ్రామం నుంచి నడుచుకుంటూ విద్యార్థులు పాఠశాలకు వెళ్లేవారు. అయితే పిట్టలగూడెం -మల్లాపురం గ్రామాల మధ్య బైపాస్ రోడ్డు వేయడంతో నడుచుకుంటూ వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. దీంతో గ్రామం నుంచి ఓ ఆటోను ఏర్పాటు చేసి ప్రతి నెల విద్యార్థికి రూ.400చొప్పన ఇస్తున్నారు. అయితే కొంతమంది ప్రతి నెల రూ. 400 చెల్లించి పాఠశాలకు పంపలేక పిల్లలు చదువులను మాన్పించేస్తున్నారు. ప్రతి నెల రవాణా చార్జీలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామని కొంతమంది విద్యార్థులు మధ్యలోనే చదువు ఆపేశారని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా మల్లాపురం వరకు రవాణా సౌకర్యం కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రుల వేడుకుంటున్నారు.

రవాణా సౌకర్యం కల్పించాలి



మా పిల్లలు మల్లాపురం ప్రభుత్వ పాఠశాలకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేదు. గతంలో నడుచుకుంటూ విద్యార్థులు స్కూల్‌కు వెళ్లేవారు. మల్లాపురం వద్ద బైపాస్ రోడ్డు నిర్మించాక నడుచుకుంటూ వెళ్లలేకపోతున్నారు. నెలకు రూ.400 చెల్లించి ప్రైవేటు వాహనంలో పంపిస్తున్నాం. ప్రభుత్వం స్పందించి రవాణా సౌకర్యం కల్పించాలని కోరుతున్నాం.

– యాదమ్మ, విద్యార్థి తల్లి, పిట్టల గూడెం

ఇబ్బందులు పడుతున్నాం



గ్రామం నుంచి మల్లాపురం పాఠశాలకు వెళ్లడానికి బస్సులు లేవు. ప్రైవేటు వాహనికి నెలకు రూ.400 చెల్లించి పాఠశాలకు వెళ్తున్నాం. చదువుకోవాలని ఉన్న నెల నెల డబ్బులు చెల్లించాల్సి వస్తుండడంతో మా తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. దాతలు, ప్రభుత్వం స్పందించి మాకు రవాణ సౌకర్యం కల్పించాలని కోరుతున్నాం.

– ప్రవళిక , 8వ తరగతి విద్యార్థిని, పిట్టల గూడెం